సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం ၊ 17 ၊ ఆగస్టు ၊ 2023



మౌలిక వసతులకు ప్రాధాన్యం

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు చెప్పారు. 8లో



మిర్చి సాగుకు సన్నద్ధం

వాణిజ్య పంట మిర్చి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. 8లో



డ్రా పాట్ల వివరాలు సేకరించండి

పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్ల వివరాలు సేకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

సీఎం చేతులమీదుగా పురస్కారం మరువలేనిది

● పాడేరు సీఐ సుధాకర్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్ : ముఖ్యమంత్రి చేతులమీదుగా శౌర్య పురస్కారం అందుకోవడం తన జీవితంలో ఎన్నటికీ మరువలేనిదని పాడేరు సీఐ సుధాకర్ పేర్కొన్నారు. 2022 సంవత్సరంలో పాడేరు సర్కిల్ పరిధిలో మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో అసాధారణ ప్రతిభ కనబర్చినందుకు ఈ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం తాడేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి శౌర్య పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా తనను ప్రోత్సహించిన అప్పటి ఎస్పీ సతీష్‌కుమార్, ప్రస్తుత ఎస్పీ తుహిన్ సిన్హాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజవొమ్మంగి ఎస్‌ఐకు సీఐగా పదోన్నతి



నరేంద్రప్రసాద్

రాజవొమ్మంగి: స్థానిక ఎస్‌ఐ తుర్లపాటి గోపీ నరేంద్రప్రసాద్‌కు సీఐగా పదోన్నతి లభించినట్లు రాజవొమ్మండి సీఐ షేక్ బాజిలాల్ తెలిపారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఈమేరకు ఉత్తర్వులు అందాయన్నారు. గోపీ నరేంద్రప్రసాద్ గత రెండేళ్లుగా ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు.

సీజ్ చేసిన బియ్యానికి 23న వేలం

● జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

పాడేరు రూరల్ : సీజ్ చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన 113 టన్నుల బియ్యానికి ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాడేరు, జి.మాడుగుల, కొయ్యూరు, పెదబయలు, చింతూరు, రంపచోడవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల్లోని గోదాముల్లో సీజ్ చేసిన బియ్యాన్ని భద్రపరిచామన్నారు. వీటిని ఆయా గోదాముల వద్ద ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ వేలం వేస్తామన్నారు. పాల్గొనదలిచేవారు రూ.వెయ్యి దరఖాస్తు రుసుంతోపాటు కలెక్టర్ సీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లా పేరున బాకూరు (పాడేరు) బ్రాంచిలో చెల్లుబాటు అయ్యేలా రూ.20 వేల డీడీ తీయాలని సూచించారు. ఈ వేలంలో పాల్గొనే వ్యాపారులు, రైస్ మిల్లర్లకు తప్పనిసరిగా జీఎస్టీ ఉండాలన్నారు. పూర్తి వివరాలకు పాడేరు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వైద్యసిబ్బందిపై ఫిర్యాదు

కొయ్యూరు: అనారోగ్యంతో మండలంలోని కంఠారం పీహెచ్‌సీకి వెళ్తే ఎవరూ పట్టించుకోలేదని గ్రామ ఉప సర్పంచ్ కాళ్ల వనంబాబు బుధవారం డీఎంహెచ్‌వో జమాల్‌బాషాకు ఫిర్యాదు చేశారు. సుమారు గంటపాటు ఆస్పత్రిలో వేచి ఉన్నా ఎవరు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. దీనిపై డీఎంహెచ్‌వోను వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టాబ్బాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో పని చేస్తున్న 37 మందిని రెన్యువల్ చేస్తామన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో పని చేసిన ఒప్పంద అధ్యాపకులు మాత్రమే ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అధ్యాపకులు ఈనెల 19 సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాని ఆయన సూచించారు. రెన్యువల్ కొరకు ఈనెల 23న జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రెన్యువల్ అయిన ఒప్పంద అధ్యాపకులు ఈనెల 24న అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు.



పాడేరు నియోజకవర్గ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అరకు నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వైవీ సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ,జెడ్పీ చైర్‌పర్సన్లు స్వాతిరాణి, సుభద్ర, పరిశీలకుడు ఫరూఖీ



పాడేరులో బైక్ ర్యాలీలో స్కూటీలు నడుపుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి

జగన్ వెంటే జనం

- 2024లో అధికారంలోకి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే గిరిజనులకు మేలు
- అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాల్లో భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- పాడేరులో భారీ బైక్ ర్యాలీ
- జగన్ నాయకత్వం వర్థిల్లాలని నినాదాలు



పాడేరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: రాష్ట్రంలో ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పార్టీ పాడేరు నియోజకవర్గ సమావేశాన్ని బుధవారం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. మహానేత వైఎస్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో గిరిజన ప్రాంత ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై వారి ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. 2024 ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో గెలిచే లక్ష్యంతో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, ఇతర ప్రతిపక్షాల కుట్రలను గ్రామస్థాయిలోనే భగ్నం చేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం పూర్తిచేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులందరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అక్రమ బాక్సైట్ జీవోల రద్దు

ప్రతిపక్ష నేతగా గిరిజనుల బాక్సైట్ పోరాటానికి మద్దతునిచ్చారని, టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన అక్రమ బాక్సైట్ జీవోలన్నింటిని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసి,గిరిజనుల పక్షాన నిలిచిన మహోన్నత నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గిరిజనులు ఉన్నత వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని, పాడేరులో రూ.500కోట్లతో వైద్య కళాశాలను నిర్మిస్తున్నారని, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల, గిరిజన యూనివర్సిటీల ఏర్పాటు శుభ పరిణామమన్నారు. పీవీటీజీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఉచితంగా విత్తనాలతో పాటు పసుపు యంత్రాలను కూడా పంపిణీ చేసిందన్నారు.

ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ నుంచి మరింత భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా అన్ని గ్రామాలను సందర్శించి కష్టసుఖాలు తెలుసుకుంటున్నామని తెలిపారు. 2014లో జగన్‌మోహన్‌రెడ్డి బిక్షతో ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి ఈశ్వరి, వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిందన్నారు. టీడీపీకి అమ్ముడుపోయిన ఆమె రాజకీయ భిక్ష పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం దారుణమన్నారు.

వారి యాత్రలు నిష్ఫలం: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు ఎన్ని యాత్రలు చేసినా ఒరిగిందేమీ లేదని విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు ఎంతో మేలు జరిగిందన్నారు.రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ పరిశీలకుడు ఫరూఖీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులంతా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఎంతో మంచి జరిగిందన్నారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్బ నరసింగరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జంపరంగి లిల్లి, ఎంపీపీలు ఎస్.రత్నకుమారి, బడుగు రమేష్,కోరాబు అనుషాదేవి, జెడ్పీటీసీ వారా నూకరాజు, పాడేరు, చింతపల్లి, కొయ్యూరు, జి.కే.వీధి మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు

భారీ ర్యాలీతో ఘన స్వాగతం

సమావేశానికి ముందు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి పాడేరు వరకు బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి స్కూటీ నడిపారు. జగన్ నాయకత్వం వర్థిల్లాలి అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. వంతాడపల్లి చెక్‌పోస్టు నుంచి వీఆర్ కల్యాణమండపం వరకు ర్యాలీ సాగింది. వైవీ సుబ్బారెడ్డిని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. పాడేరు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు కూతంగి సూరిబాబు,రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, పాడేరు, కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల పార్టీ మండల అధ్యక్షులు సీదరి రాంబాబు,జల్లి బాబులు,మోరి రవి,బెబ్బులి లక్ష్మణ్, సుర్మని నాయుడు, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,సల్లా చిట్టమ్మ,మాజీ ఎంపీపీలు ఎస్వీ.రమణమూర్తి,మత్స్యరాస బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



అరకులోయ నియోజకవర్గ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గిరిజనులంటే రెండింతల ప్రేమ

అరకులోయ టౌన్: గిరిజన ప్రాంతం పట్ల వైఎస్సార్ కంటే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డికి రెండింతల ప్రేమ అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో జగన్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2024లో ఎవరిని పార్టీ నిర్ణయిస్తే వారి గెలుపు కోసం అందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. చంద్రబాబు పాదయాత్ర, పవన్ వారాహి యాత్ర, లోకేష్ యువగళం అని ప్రజల్లోకి వస్తూ అధికారంలోకి వస్తే వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని తొలగిస్తామంటున్నారన్నారు. పేదల సంక్షేమం వారికి ఇష్టం లేదన్నారు. గతంలో 40 పడకలున్న అరకు ఏరియా ఆస్పత్రిని జగన్ సీఎం అయిన తరువాత వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచారన్నారు.

జగన్ అంటే ప్రాణం: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గిరిజనులకు జగన్ అన్నా.. వైఎస్సార్‌సీపీ అన్నా ప్రాణమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. గడప గడపకు వెళ్లి జగన్ ఫొటో చూపితే కొందరు అన్నా అని.. మరికొందరు మా కొడుకు అని అవ్వాతాతలు అంటున్నారన్నారు. వారి గుండెల్లో చెరగని స్థానం జగన్ సంపాదించుకున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో అరకు నియోజకవర్గంలో రూ. 780 కోట్లతో 317 రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు నెలకు రూ.10 వేలు పింఛను ఇస్తున్నది జగన్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. అరకు నియోజకవర్గంలో టీడీపీకి అడ్రస్ లేదన్నారు. అరకులో మళ్లీ వైఎస్సార్‌సీపీ పాగా వేస్తుందని స్వయంగా చంద్రబాబు రివ్యూ సమావేశంలో అన్నట్టు తెలిసిందన్నారు.



ర్యాలీగా వస్తున్న వైవీ సుబ్బారెడ్డి, పార్టీ శ్రేణులు

వాయిద్యాల నడుమ..

అరకులోయ విచ్చేసిన వైవీ సుబ్బారెడ్డికి డప్పువాయిద్యాల నడుమ, పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జిందాబాద్, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, నేను సైతం ట్రస్టు వ్యవస్థాపకుడు శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యే హైమావతి, స్వచ్ఛంద సంస్థల డైరెక్టర్ సోమేశ్వరి, ఎంపీపీలు ఉషారాణి, నీలవేణి, బి. ఈశ్వరి, రాంబాబు, జెడ్పీటీసీలు రోశిని, జానకమ్మ, కె. బొంజుబాబు, పార్టీ అధ్యక్షులు గాశి, శెట్టి ఆనంద్, గోపాల్, కొండబాబు, ఆనందరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులైన వనుగుపల్లి పంచాయతీ బిరిమిశాలలోని జనసేనకు చెందిన 8వవార్డు సభ్యుడు డోకుల మత్స్యబాబు తన అనుచరులు 10 మందితో కలిసి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు.

వీరికి వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వనుగుపల్లి సర్పంచ్ మువ్వల మీనా,మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వార్డుసభ్యుడు, ఇతర నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జోనల్ మలేరియా అధికారి సుబ్రహ్మణ్యేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరి

రంపచోడవరం: ప్రస్తుత సీజన్‌లో దోమల ద్వారా సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాపించే అవకాశాలు ఉన్నందున వైద్య సేవల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి బి.సుబ్రహ్మణ్యేశ్వరి సూచించారు. బుధవారం రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో మలేరియా సిబ్బందితో స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో దోమ మందు స్ప్రేయింగ్, ఫీవర్ సర్వే, లార్వా సర్వే, దోమ లార్వా ఉన్నచోట యాంటీ లార్వా నిర్వహించాలని సూచించారు. బయోలాజికల్ కంట్రోల్‌లో భాగంగా గంభూషియా చేపలను చెరువులు, కొలనుల్లో విడుదల చేసేందుకు సత్వర ప్రణాళికతో కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని సూచించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశ అనంతరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిసి ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలను వివరించారు.

తప్పలమామిడిలో విద్యాలయం ప్రారంభం

కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో ఏర్పాటు



తప్పలమామిడిలో విద్యార్థులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతపల్లి: మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ తప్పలమామిడిలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పాయి. గ్రామంలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు సుమారు 22 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పాఠశాల లేకపోవడంతో సమీప గ్రామాలకు వెళ్లి చదువుకుంటున్నారు. చిన్నారుల కష్టాలను తెలుసుకున్న సామాజిక కార్యకర్త ప్రదీప్ గ్రామస్తులతో కలిసి సమస్యను కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గ్రామంలో ఎన్ఆర్ ఎస్‌టీసీ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అంగీకరించారు. తాను నిధులు మంజూరు చేస్తానని, భవన నిర్మానానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ప్రదీప్ పర్యవేక్షణలో గిరిజనులు శ్రమదానంతో భవనం నిర్మించారు.అందుకు అవసరమైన నిధులు రూ.4.10 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు. ఇక నుంచి వలంటీర్‌తో విద్యా బోధన చేయనున్నారు. మారుమూల గ్రామాల్లో ఇటువంటి గ్రామాలను గుర్తించి నాన్ రెసిడెన్షియల్ స్కూల్ (ఎన్ఆర్ఎస్‌టీసీ) చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఎంఈవో ప్రసాద్, బోడెం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు ఆలంబనగా..

- బాసటగా నిలుస్తున్న శిశు జనన నిరీక్షణ కేంద్రాలు
- పాడేరు డివిజన్‌లో 15 ఏర్పాటు
- ప్రసవానికి నెల రోజులు ముందుగానే తరలింపు
- వైద్యంతోపాటు మెరుగైన పౌష్టికాహారం
- నెలకు 300 నుంచి 350 వరకు సుఖ ప్రసవాలు

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిశు జనన నిరీక్షణ కేంద్రాలు (బర్త్ వెయిటింగ్ హాల్) సత్ఫలితాలిస్తున్నాయి. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో ఏర్పాటు చేసిన 15 కేంద్రాలు గర్భిణులకు బాసటగా నిలుస్తున్నాయి. వీటిలో నెలకు 300 నుంచి 350 వరకు సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి.

పెదబయలు: గిరి మహిళల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం వస్తోంది. ముఖ్యంగా గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని గుర్తిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాటుచేసిన శిశు జనన నిరీక్షణ కేంద్రాలు (బర్త్ వెయిటింగ్ హాల్)ను సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లాలో గతంలో పాడేరు, అరకులోయ, చింతపల్లి ఏరియా ఆస్పత్రులో మాత్రమే గర్భిణుల్లో హైరిస్క్ కేసులకు వైద్యం అందించి ప్రసవాలు చేసేవారు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 15 కేంద్రాలను ఏర్పాటుచేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, అరకు, చింతపల్లి ఏరియా ఆస్పత్రుల్లో పది పడకలు, మిగిలిన పీహెచ్‌సీల్లో నాలుగు నుంచి ఐదు బెడ్ల సదుపాయం కల్పించారు.



పెదబయలు పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

● పెదబయలు మండలంలో పీహెచ్‌సీ ఆవరణలో రూ.30 లక్షలతో ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) నిధులతో నాలుగు బెడ్ల సదుపాయం కలిస్తూ బర్త్ వెయిటింగ్ హాల్ ఏర్పాటుచేశారు.

నెలకు 300 నుంచి 350 వరకు.. : బర్త్ వెయిటింగ్ హాల్‌లకు ప్రసవానికి ముందుగానే వైద్యసిబ్బంది గర్భిణులను తరలిస్తున్నారు. మంచి వైద్యం, పౌష్టికాహారం అందించి సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి తరలిస్తున్నారు. ఒక్క పైసా కూడా ఖర్చులేకుండా సేవలందిస్తున్నారు.



పెదబయలులో నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాల్



సుఖప్రసవం తరువాత తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో..

సేవలు బాగున్నాయి



రక్తం తక్కువగా ఉన్నందున హైరిస్క్ కేసుగా నమోదు చేశారు. ప్రస్తుతం పెదబయలు బర్త్ వెయిటింగ్ హాల్‌లో చేర్పించి వైద్యం, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారు. వైద్యాధికారి, సిబ్బంది ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారు. స్కానింగ్ అవసరమైతే పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్సులో తీసుకువెళ్తున్నారు. ఎంతో బాగా చూసుకుంటున్నారు.

– వంతాల శాంతి, సిల్బరి గ్రామం, కుంతుర్ల పంచాయతీ

హైరిస్క్ కేసులపై ప్రత్యేకదృష్టి



గర్భిణుల్లో హెచ్‌బీ తక్కువగా ఉండడం, ఇతర కారణాల వల్ల హైరిస్క్ కేసులుగా గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఏ ప్రాంతంలోనైనా బర్త్ వెయిటింగ్ హాల్‌లో చేరి సేవలు పొందవచ్చు. ఇప్పుడు వీటి ప్రయోజనాలను గుర్తిస్తున్నారు. ఇక్కడ అందించే సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– సీహెచ్‌సీ సింధూరం పడాల్, వైద్యాధికారి, పెదబయలు

మాతా శిశుమరణాలు అరికట్టడమే లక్ష్యం

మాతా శిశుమరణాలు అరికట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రసవ తేదీకి నెల రోజులు ముందుగానే బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు తరలించి ఆరోగ్య పరిస్థితి మెరుగుకు అవసరమైన వైద్యం, పౌష్టికాహారం అందిస్తున్నాం. ఈ కేంద్రాలకు ఆదరణ పెరుగుతోంది. చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

– జమాల్‌బాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పాడేరు

క్లుప్తంగా

కిసాన్ డ్రోన్లతో బహుళ ప్రయోజనాలు


మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: డ్రోన్లు వినియోగంతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏవో ఉమాదేవి సూచించారు. మర్రివాడ రైతు భరోసా కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో కిసాన్ డ్రోన్ రూ.10లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఉంటుందని, దీనికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. రైతులు గ్రూపుగా లేదా వ్యక్తిగా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. పురుగుమందును ఎకరానికి 20 నిమిషాల్లో పిచికారీ చేస్తుందన్నారు. డ్రోన్‌ల వినియోగానికి సంబంధించి ఇంటర్ లేక డిగ్రీ లేక వ్యవసాయ పాలిటెక్నిక్ చేసి ఉండాలన్నారు. డ్రోన్లు కావలసిన వారు తమను సంప్రదించాలని ఆమె సూచించారు.

మిర్చి సాగుకు సన్నద్ధం

- ముమ్మరంగా నారుమడుల తయారీలో రైతుల నిమగ్నం
- దుక్కులు సిద్ధం
- ఆశల సాగుపై ప్రత్యేక శ్రద్ధ


గన్నవరంలో మిర్చి నారుమడులు

ఎటపాక: వాణిజ్య పంట మిర్చి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఇటీవల వర్షం కురిసి తెరిపివ్వడంతో మిర్చి నారుమడులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న మిర్చి పంటపైనే కోటిఆశలు పెట్టుకున్నారు.ఈ ఏడాదైనా తోటలు తెగుళ్లు బారిన పడకుంటే మంచి దిగుబడులు వచ్చి అప్పుల గట్టెక్కుతామనే నమ్మకంతో ఉన్నారు. విలీన మండలాల్లో ప్రతీ ఏడాది సుమారు 15వేల ఎకరాల్లో మిర్చి పంట పండిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి వరదలు లేకపోవడంతో సకాలంలోనే పొలాల్లో మొక్కలు నాటుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నారు మడుల తయారీ ఇలా

గోదావరి వరద ముంపు లేని ప్రాంతాల్లో జులై నెలలోనే ప్రత్యేకమైన దుక్కులు చేసి దుక్కుల్లో పశువుల పెంట, ఎరువులు కలిపి మడులుగా తయారు చేసుకుంటారు. వేలాది రూపాయలతో (కిలో విత్తనాలు రూ.1లక్ష సుమారు) కొనుగోలు చేసిన వివిధ రకాల మిర్చి విత్తనాలను మడుల్లో విత్తుకుంటారు. విత్తనాలు వేసిన మడులపై పాల చెట్టు ఆకులు, లేక తాటి చెట్టు ఆకులను, కొందరు ఊకతో కప్పి విత్తనాలు మొలకెత్తిన తరువాత ఆకులను తొలగిస్తారు. అప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుమారు 45 రోజుల పాటు నారును కంటికి రెప్పలా కాపాడుకుంటారు. గంట గంటకు మడులను నీటితో తడుపుతూ చీడపీడలు సోకకుండా పురుగు మందులు పిచికారీ చేస్తారు. ఎటపాక మండలంలోనే 2వేల హెక్టార్లకుపైగా మిర్చి సాగు చేస్తారు. వాతావరణ పరిస్థితులు, గోదావరి వరదలతో పత్తి, వరి పంటల సాగు కలిసి రాకపోవడంతో ఎక్కువ మంది రైతులు మిర్చి సాగుపైనే మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ఎకరా సాగుకు రూ 1.50లక్షలు పైగా ఖర్చుచేస్తున్నారు.

గిట్టుబాటు ధరలపైనే ఆశలు

గత నెలలో గోదావరి వరదలు వచ్చి పోవడంతో ప్రస్తుతం పొలాలన్నీ ఆరుదలనిచ్చాయి. దీంతో ట్రాక్టర్లతో ముమ్మరంగా దుక్కులు చేసుకుంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో వారం రోజుల్లో పొలాల్లో మొక్కలు నాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. రబీలో సాగుచేసే మిర్చి సాగుపైనే విలీన మండలాల రైతులు ఆశలు పెట్టుకుని వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గోదావరి వరదల ఆగస్టు గండం గట్టెక్కితే సాగు కలిసి వస్తుందని రైతులు చెబుతున్నారు. గత ఏడాదిలా ఈఏడాది మిర్చి క్వింటాకు మంచి గిట్టుబాటు ధర ఉంటే అప్పుల ఊబి నుంచి బయట పడతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డ్రాప్ అవుట్ల వివరాలు సేకరించండి

- నాడు- నేడు బిల్లులు అప్‌లోడ్
- మెనూ కచ్చితంగా అమలు చేయాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్ల వివరాలు సేకరించి, వారు మరలా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను గుర్తించి డ్రాపౌట్లుకు గల కారణాలను విశ్లేషించాలని, ఆయా గ్రామాలకు వెళ్లి వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకుల ద్వారా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జీవీకే కిట్ల పంపిణీ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు సరి చూడాలని సూచించారు. జిల్లాలో 20 వేలకు పైగా డ్రాపౌట్లు ఉండవచ్చని, దీనిపై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కసరత్తు చేయాలని ఆదేశించారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని, పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, గురువారం సాయంత్రానికి పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేసి, తదుపరి ఏ రోజుకారోజు నిరంతరం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎంఈవోలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఫేజ్-2కు సంబంధించి ఎంవోయూలను అప్‌లోడ్ చేయాలన్నారు. పాఠశాలలో, వసతి గృహాల్లో సక్రమంగా మెనూ అమలు చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని హెచ్చరించారు. జీసీసీ నుంచి పంపే సరకులు, కేజీబీవీల మాదిరిగా నేరుగా విద్యా సంస్థలకే రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'ఆడుదాం -ఆంధ్రా'కు కమిటీలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ రెండో తేదీ నుంచి 31 తేదీ వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఐదు క్రీడలకు సంబంధించి ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడల నిర్వహణకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ కమిటీలు ఏర్పాటు చేశామని, జిల్లా మొత్తం 64 కేంద్రాలు ఎంపిక చేసినట్టు తెలిపారు. 17 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులు ఈ క్రీడాపోటీలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 1వతేదీ సంబంధిత సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, గిరిన సంక్షేమ ఉప సంచాలకులు కొండలరావు, పాడేరు డివిజన్ సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, జిల్లా క్రీడాధికారి జగన్మోహనరావు, మండలాల అధికారులు వర్చువల్ విధానం ద్వారా హాజరయ్యారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్టన్ రైల్వే హౌరా డివిజన్ పరిధిలో జరుగుతున్న ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- ఈ నెల 17, 19, 22, 24, 26, 29 తేదీల్లో డిబ్రూఘడ్- కన్యాకుమారి (22504) వివేక్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా న్యూ ఫరక్కా, అజీమస్‌గంజ్, కత్వ, బందేల్, హౌరా, అండుల్ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 16, 17, 19, 21, 23, 24, 26, 28 తేదీల్లో కన్యాకుమారి-డిబ్రూఘడ్(22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా అండుల్, హౌరా, కత్వ, బందేల్, అజీమస్‌గంజ్, న్యూ ఫరక్కా మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 20న విశాఖపట్నం-రంగపర నార్త్ (08562) జనసాధారణ్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా అండుల్, హౌరా, కత్వ, బందేల్, అజీమస్‌గంజ్, న్యూ ఫరక్కా మీదుగా నడుస్తుంది.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్

భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 20వ తేదీ నుంచి కలుపరఘాట్ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు. భువనేశ్వర్-బెంగళూరు (18463) ఎక్స్‌ప్రెస్ కలుపరఘాట్‌కు ఉదయం 6.36 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.38 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు-భువనేశ్వర్(18464) ఎక్స్‌ప్రెస్ కలుపర్‌ఘాట్‌కు సాయంత్రం 5.23 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 5.25గటలకు బయల్దేరుతుంది.

పలు రైళ్లు రీషెడ్యూల్.

పలు లింక్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడం వల్ల ఆయా స్టేషన్ల నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- బెంగళూరులో బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు-హౌరా(12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 5.30 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.

పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


రాజుంపాలెంలో జీపీఎస్ పాఠశాలలో అదనపు భవనం పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

అడ్డతీగల: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు చెప్పారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణానికి వారు బుధవారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అదనపు భవనం కోసం ఐటీడీఏ రూ.5లక్షలు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటున్నాయన్నారు. గిరిజన విద్యార్థులు విద్యపరంగా మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించేందుకు మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అనంతరం రాజుంపాలెంలో జీపీఎస్ పాఠశాలలో రూ.24లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అందుబాటులో ఉన్న వసతులను వినియోగించుకుని విద్యార్థుల మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకట సత్యనారాయణ, అడ్డతీగల ఎంపీటీసీ వడ్లమూరి రత్నం, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


పద్మాపురం గార్డెన్‌లో ఏర్పాటు చేయనున్న విద్యుత్ దీపాలను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయటౌన్: మన్యంలో పర్యాటక అభివృద్ధికి ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారించినట్టు పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్ అన్నారు. అరకులోయ మండలంలోని పద్మాపురం ఉద్యానవనంలో ఆయన బుధవారం పర్యటించారు. అక్కడ నిర్మిస్తున్న కాటేజీలు, క్యాంటీన్, గార్డెన్, పగోడాలు, హ్యాండీ క్రాఫ్ట్ సెంటర్ల పనులను పరిశీలించారు. పనుల్లో పలుచోట్ల మార్పులు, చేర్పులపై టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాలరావుకు సూచించారు. పెండింగ్ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాటేజీలోని ఆరు గదులకు ఒక్కో గదికి ఒక్కో పేరు పెట్టాలని సూచించారు. గార్డెన్ ఆవరణలో కాటేజీ ఎదురుగా ఏర్పాటు చేసిన గార్డెన్ ఫుట్‌వే పై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతం ఊటీ, కొడైకెనాల్‌కు దీటుగా మారుస్తామన్నారు. పర్యాటక శాఖ హోటల్‌లో గదుల రేట్లు నిర్ణయించిన దాని కంటే తక్కువ అద్దెకు అందుబాటులో తీసుకురానున్నట్టు చెప్పారు. పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి పరుస్తామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే క్యాంటీన్‌కు హెరిటేజ్ సెంటర్‌గా నామకరణం చేస్తామన్నారు. ఈ క్యాంటిన్‌లో రాగి అంబలి, రాజ్‌మా, కొర్రలు, సామలతో తయారు చేసిన టిఫిన్ అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా ఉపాధి కల్పించడంలో భాగంగా ఇక్కడ పనిచేసేందుకు గిరిజన యువతను ఎంపిక చేశామన్నారు. వెలుగు ద్వారా 20 రకాల హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులను అందుబాటులో తీసుకువస్తామన్నారు. కొత్తపల్లి జలపాతంలో రైలింగ్స్, వ్యూపాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. కొయ్యూరు, పాడేరులో కొత్తగా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా గిరి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. టీడబ్ల్యూ ఏఈ అభిషేక్, గార్డెన్, మ్యూజియం మేనేజర్‌లు లకే బొంజుబాబు, మురళీ, వెలుగు ఏపీడి కృష్ణారావు, ఏపీఎం అప్పయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం

- 19న సీలేరు సర్పంచ్‌కు ఉప ఎన్నిక
- వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థికి టీడీపీ, కాంగ్రెస్ నాయకుల సహకారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దుతు అభ్యర్థి

సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గతంలో ఉన్న సర్పంచ్ కిల్లో పరదేశి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పంచాయతీలో ఉన్న కొన్ని పార్టీల నేతలు ఏకగ్రీవమై గత సర్పంచ్ పరదేశీ కుటుంబ సభ్యులకు పదవిని ఇవ్వాలని నిర్ణయించారు. కొంతమంది నాయకులు అంగీకరించకపోవడంతో ఎన్నిక అనివార్య మైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా పాంగి దుర్గో (కత్తెర గుర్తు) బరిలో నిలిచారు. వలంటీరుగా పనిచేస్తున్న ఈయన రాజీనామా చేసి సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. అభ్యర్థి దుర్గోకు వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు కాంగ్రెస్, టీడీపీకి చెందిన ఒక వర్గం మద్దతు తెలుపుతూ ప్రచారం చేస్తున్నారు. టీడీపీ మద్దతు అభ్యర్థి పాంగి దశరథ్ (మంచం గుర్తు), బీజేపీ మద్దతు అభ్యర్థికి పాంగి సుమిత్ర (ఉంగరం గుర్తు) కేటాయించారు. సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక ఈనెల 19న మండల ఎంపీపీ పాఠశాలలో జరగనుంది. ఈ మేరకు ఎన్నికకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థికే మొగ్గు

సచివాలయంలో వలంటీరుగా చేస్తూ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న పాంగి దుర్గో విజయం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీ నుంచి ప్రస్తుతం సీలేరు ఉప సర్పంచ్‌గా ఉన్న కె.వల్లీ ప్రసాద్, కాంగ్రెస్ నుంచి కొందరు నాయకులు, ప్రస్తుత వార్డు సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు మద్దతుతో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదిలా ఉండగా బరిలో ఉన్న అభ్యర్థులు ఒకే ఇంటి పేరుతో ఉండడం ఆసక్తిగా ఉంది. ఉప ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధిగా అమలవుతుందని పోలీసులు తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు


సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు ఏఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు నకలు

వై.రామవరం : చవిటిదిబ్బలు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తమను దుర్భాషలాడారంటూ ఆ గ్రామ సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు రంపచోడవరం ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఒక స్థల వివాదం పరిష్కారం కోసం అతని ఇంటికి తాను, తన భర్త రమేష్, గ్రామపెద్దలు వెళ్లగా, గిరిజనులమైన తమను కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై విచారణ నిర్వహించి, దోషులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని ఆమె ఏఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై విచారణ చేస్తామని ఏఎస్పీ జగదీష్ అడహళ్లీ తెలిపారు.

యువ క్రికెటర్లకు చక్కటి అవకాశం ఏపీఎల్

- ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి
- అట్టహాసంగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్-2 ఆరంభం


విజేత ట్రోఫీని వేదిక వద్దకు తీసుకువస్తున్న రషీద్


రన్నరప్ ట్రోఫీని తీసుకువస్తున్న రికీబుయ్


ప్రసంగిస్తున్న మంత్రి అమర్‌నాథ్


పోటీలను ప్రారంభిస్తున్న హీరోయిన్ శ్రీలీల

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెటర్ల ప్రతిభను ప్రదర్శించేందుకే ఏపీఎల్ ప్లాట్‌ఫాం కానుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి పేర్కొన్నారు. బీసీసీఐ సహకారంతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌ను బుధవారం వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర తరఫున పలు కేటగిరిల్లో యువ క్రీడాకారులు ఆడుతున్నారని.. వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహించడమే ఏపీఎల్ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ఐటీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ఏపీలోని ప్రతీ గ్రామ, వార్డులో ఔత్సాహిక ఆటగాళ్లను ప్రోత్సహించే విధంగా 'ఆటాడుకుందాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. ఈ పోటీల్లో 15 వేలకు పైగా జట్లు ఎంపిక చేసిన క్రీడల్లో పోటీపడనున్నాయన్నారు. తొలుత అతిథిగా హాజరైన సినీ నటి శ్రీలీల ఆయా జట్ల ఫ్రాంచైజీ అధినేతలు, కెప్టెన్‌లతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ అధ్యక్షుడు, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఫెర్రర్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కోస్టర్ రైడర్స్-బెజవాడ టైగర్స్ జట్ల మధ్య పోరుతో ఈ సీజన్ ఆరంభమైంది. శరత్‌చంద్రరెడ్డి టాస్ వేశారు. ఏపీఎల్ సీజన్-2 ఆరంభ మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్ జట్టుపై కోస్టల్ రైడర్స్ 12 పరుగుల తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది.


బెట్‌ను అపీల్ చేస్తున్న బెజవాడ టైగర్స్ టీమ్

అభిమానుల సందడి

ఏపీఎల్-2 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత విజేతలకు అందించే ట్రోఫీతో ఆరుజట్ల ఫ్రాంచైజీ యజమానులు, కెప్టెన్లు ఫొటో సెషన్ నిర్వహించారు. సినీ నటి శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐపీఎల్ తరహాలో చీర్‌గాల్స్ సైతం బౌండరీలు, వికెట్లు పడినప్పుడు అభిమానులను ఉత్సాహపరిచారు. స్టేడియంలో అభిమానుల సందడి నెలకొంది.


స్వీప్ షాట్ ఆడుతున్న కోస్టల్ రైడర్ బ్యాట్స్‌మెన్


ప్రేక్షకుల కేరింతలు